
డ్రైవర్లు, కండక్టర్లకు వీడ్కోలు పలుకుతున్న దిల్‌సుఖ్‌నగర్ డీఎం హరి

ఆర్టీసీ ఉద్యోగులకు సన్మానం

చాదర్‌ఘాట్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపోలో విధులు నిర్వహించి శనివారం పదవీ విరమణ చేసిన ఐదుగురు కార్మికులను డిపో మేనేజర్ హరి ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. డిపోలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డి.పరంధాములు, ఏడీసీ ఎల్.శంకర్, డ్రైవర్లు ఎల్.లక్ష్మయ్య, కె.లక్ష్మయ్య ఆర్.భీమ పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ ఏళ్ల తరబడి కలిసి పనిచేసిన ఉద్యోగులకు దూరం కావడం బాధ కలిగించినా, శేష జీవితం కుటుంబీకులతో గడపాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ వెంకన్న, ఎంఎఫ్ వెంకటేశ్, ఏడీసీలు బుచ్చిరెడ్డి, ఏఎస్.రెడ్డి, ఎంవీఎస్.రావు, వెల్ఫేర్ బోర్డు కమిటీ సభ్యులు జీఎన్.రెడ్డి, ఎస్ఎంయూ రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రెటరీ సత్యం, నాయకుడు మోహన్, సాజు పాల్గొన్నారు.

గోశాలను పరిశీలించిన ధర్మకర్తలు


గోశాలను పరిశీలిస్తున్న ధర్మకర్తలు ఆనంద్‌కుమార్‌గౌడ్, అంజిరెడ్డి

చంపాపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానంలోని గోశాలను శనివారం ఆలయ ధర్మకర్తలు ఆనంద్‌కుమార్‌గౌడ్, అంజిరెడ్డి, చీర తిరుమలేష్, చేగోని సురేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా గోవులకు మేతతో పాటు తాగునీటిని అందుబాటులో ఉంచి సంరక్షించాలని ఆలయ సిబ్బందికి సూచించారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

టీచర్స్‌కాలనీలో విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు

చంపాపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని పంచాయతీరాజ్ టీచర్స్‌కాలనీలోని శ్రీగిరి శారదా కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీ గణపతి, సరస్వతి, ధ్యాసాంజనేయస్వామి, విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్థంభ ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి వేర్వేరుగా పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పండితులు నవీణ్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.


మంజులారెడ్డి, లక్ష్మారెడ్డిని సత్కరిస్తున్న బీజేపీ నేత హరిగౌడ్

మహిళా, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులకు సన్మానం

సంతోష్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ మహిళా మోర్చా భాగ్యనగర్ జిల్లా అధ్యక్షురాలిగా మంజులా రెడ్డి, కిసాన్‌మోర్చా అధ్యక్షుడిగా మడిగల లక్ష్మారెడ్డి ఇటీవల నియమితులయ్యారు. శనివారం బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు లింగాల హరిగౌడ్ ఆధ్వర్యంలో వారిని సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలకు జిల్లా పరిధిలో డివిజన్ల వారీగా కమిటీలను మరింత పటిష్ఠం చేయనున్నట్లు తెలిపారు. మోదీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లేలా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో నేతలు నవీన్ పటేల్, భరత్ రెడ్డి రాపోలు, ఉమేష్, చంద్రకుమార్, రమేష్, రాజు, ఉదయ్ యాదవ్, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

ఫిర్యాదు చేస్తే కొట్టారు!

- పోలీసులపై బాధితుడి ఆరోపణ
- మద్యం మత్తులో యువకులు కొట్టుకున్నారు
- ఎస్‌హెచ్‌ఓ రామాంజనేయులు

కొత్తపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదు చేసిన తనను ఎల్బీనగర్ పోలీసులు విచక్షణారహితంగా కొట్టారని ఓ యువకుడు ఆరోపించాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి కామినేని చౌరస్తాలో చోటు చేసుకుంది. మన్సూరాబాద్ సౌత్ ఎండ్ పార్క్‌లో ఉంటున్న బాధితుడైన డ్రైవర్ ఎర్ర ప్రకాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... శుక్రవారం రాత్రి కారులో దిల్‌సుఖ్‌నగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లిన ప్రకాష్ తిరిగి వస్తుండగా.. కామినేని చౌరస్తా అభినందన్ గ్రాండ్ వద్ద గుర్తుతెలియని యువకుడు మద్యం మత్తులో వాహనాలను ఆపుతూ హంగామా చేస్తున్నాడు. కారు దిగి ప్రకాష్ ఆ యువకుడిని పక్కకు పంపే ప్రయత్నం చేశాడు. అతను వెళ్లకపోవడంతో సమీపంలో ఉన్న కానిస్టేబుళ్లకు ఫిర్యాదు చేశాడు. వారు ప్రకాష్ చెబుతున్నది వినిపించుకోకుండా బూతులు తిడుతూ లాఠీతో తీవ్రంగా కొట్టారు. కొట్టొద్దని ప్రకాష్ వేడుకున్నా కనికరించలేదు. ఎక్కువగా మాట్లాడితే ఉల్టా కేసు పెడతామని బెదిరించారు. ఫిర్యాదు చేసిన పాపానికి తనపై దాడి చేసిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని బాధితుడు ఉన్నతాధికారులను కోరుతున్నాడు. పోలీసులు కొట్టడంతో తన ఎడమ చెవి వినబడడం లేదని వాపోయాడు. నాలుగు నెలల క్రితం గిరిజన మహిళ లక్ష్మిపై ఎల్బీనగర్ పోలీసులు దాడి చేసిన ఘటన మరువకముందే మరో ఘటన జరగడం దారుణమని స్థానికులు మండిపడుతున్నారు. ఈ విషయమై ఎల్‌బీనగర్ ఎస్‌హెచ్‌వో రామాంజనేయులును వివరణ కోరగా.. ఫిర్యాదుదారుడిపై కానిస్టేబుళ్లు దాడి చేయలేదన్నారు. మద్యం మత్తులో రెండు వర్గాల యువకులు కొట్టుకున్నారని, పోలీసులు వారిని చెదరగొట్టారని తెలిపారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చిన యువకుడూ మద్యం మత్తులో ఉండడంతో డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశామని చెప్పారు. సీసీ కెమెరాలను పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తామని చెప్పారు.

సామాజిక సేవతో గుర్తింపు


ఆంజనేయులును సన్మానిస్తున్న బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు పాండు యాదవ్

వనస్థలిపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవతోనే ప్రతి వ్యక్తికి సమాజంలో గుర్తింపు వస్తుందని బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాండు యాదవ్ అన్నారు. సామాజిక సేవా రంగంలో విశేష కృషిచేసి ఆల్ ది బెస్ట్ అకాడమీ సామాజిక సంస్థ నుంచి విశిష్ట ప్రతిభ సేవా రత్న అవార్డు అందుకున్న వనస్థలిపురానికి చెందిన కర్పూరి ఠాకూర్ సేవా సమితి అధ్యక్షుడు అశ్విని అంజనేయులును శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాండు యాదవ్ మాట్లాడుతూ సమాజసేవకు యువత ముందుకు రావాలన్నారు. అంజనేయులు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీసీ కులాల మేధావుల ఫోరం అధికార ప్రతినిధి అక్కల బాబు గౌడ్, సంజీవ్‌ముదిరాజ్, చెన్నయ్య, కాశీనాథ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నీళ్ల దందా!

- ప్రజల ప్రాణాలతో చెలగాటం
- అనుమతి లేకుండా ప్లాంట్ల నిర్వహణ
- ప్రమాణాలు పాటించని నిర్వాహకులు


సైదాబాద్‌లోని ఓ వాటర్ ప్లాంట్

సైదాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్, చంపాపేట, మాదన్నపేట పరిసరాల్లో కొందరు ప్యూరిఫైడ్ నీళ్ల పేరుతో వ్యాపారం చేస్తున్నారు. అనుమతి లేకుండా, ప్రమాణాలు పాటించకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. రక్షిత నీటిని తాగాలన్న ప్రజల బలహీనతను ఆసరాగా చేసుకుని ప్యూరిఫైడ్ నీళ్ల పేరిట వ్యాపారం చేస్తూ లక్షలాది రూపాయలు దండుకుంటున్నారు. వాటర్ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ, పోలీసులు, ఫుడ్ కంట్రోల్ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. కనీసం ట్రేడింగ్ లైసెన్స్ లేకుండానే నిర్వహిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు. సైదాబాద్, చంపాపేట, మాదన్నపేట పరిసరాల్లో సుమారు 30కి పైగా అనుమతులు లేని వాటర్ ప్లాంట్లు కొనసాగుతున్నాయి. పాతబస్తీలో రోజు విడిచి రోజు మంచినీటి సరఫరా జరుగుతోంది. పలు ప్రాంతాల్లో తరచూ కలుషిత నీటి సరఫరా అవుతోంది. ఈ భయంతో చాలామంది ప్యూరిఫైడ్ వాటర్‌ను కోరుకుంటున్నారు.

ఇంటి బోరుతోనే వ్యాపారం

ఇంటి అవసరాల కోసం వేసుకున్న బోరును వాణిజ్య అవసరాలకు ఉపయోగించడానికి వీల్లేదు. నీటిని బోర్లతో విచ్చలవిడిగా తోడటం వల్ల


ఆటో ట్రాలీలో తరలిస్తున్న నీటి క్యాన్లు

భూగర్భజలాలు పడిపోయే అవకాశం ఉంటడంతో వాల్టా చట్టం-2002 ప్రకారం ఈ నిబంధన ఏర్పాటుచేశారు. ఇష్టానుసారంగా రసాయనాలు కలిపి శుద్ధి చేసి ప్రజలకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు. లవణాల శాతమూ అంతంతే ఉంటోంది. బోరు నీళ్లను ప్యూరిఫైడ్ వాటర్‌గా చెప్పి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. లీటర్ క్యాన్ రూ.25 నుంచి 35 వరకు వసూలు చేస్తున్నారు. నీటి డబ్బాలపై సంస్థ పేరు, తయారీ తేదీ, సీలు వంటివి తప్పనిసరిగా ఉండాలి. ఎక్కడా అవేవీ కనిపించడం లేదు. బోరు నుంచి తోడుతున్న నీళ్లను నేరుగా ఫిల్టర్ మిషన్‌లోకి పంపుతున్నారు. తాగునీటి శుద్ధీకరణ అయిందని చెప్పి స్టీల్ ట్యాంకులోకి పంపిస్తున్నారు. అందులో నుంచి నేరుగా వాటర్ క్యాన్‌లోకి నింపుతున్నారు.

నిబంధనలు ఇవీ..

- వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ అనుమతి తీసుకోవాలి.
- వాటర్ ప్లాంట్‌కు బీఎస్‌ఐ అనుమతి తప్పనిసరి. ఏడాదికోసారి రెన్యువల్ చేయించుకోవాలి. ఐఎస్‌ఐ నిబంధనలు పాటించాలి
- ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ప్రమాణాలు కలిగిన నీటినే వినియోగించాలి, పీహెచ్ స్థాయి 7 కంటే తగ్గకుండా చూడాలి. తగ్గితే కిడ్నీ సంబంధిత సమస్యలు వస్తాయి,
- క్యాన్లు పరిశుభ్రంగా ఉండాలి. ప్రతి రోజూ పొటాషియం పర్మాంగనేట్‌తో కెమికల్ క్లీనింగ్ చేయాలి.
- వాటర్ క్యానులో నీరు పట్టే ముందు అల్ట్రా వైరస్ రేస్‌తో శుద్ధి చేయాలి, నీటిని వ్యాన్‌లోకి పట్టిన తర్వాత రెండు రోజుల పాటు భద్రపరిచి మార్కెట్‌లోకి పంపాలి
- శుద్ధి చేసిన నీటిని 304 గ్రేడ్ స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారు చేసిన పెద్ద ట్యాంకులో నింపి ఓజోనైజేషన్ చేయాలి
- ప్రతి మూడు నెలలకోసారి రా వాటర్ టెస్టింగ్ జరపాలి



చర్యలు తీసుకోవాలి..

అనుమతి లేకుండా జనావాసాల మధ్య నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్లను మూసివేయాలి. ప్రజారోగ్యంతో వ్యాపారులు చెలగాటమాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో వాటర్ ప్లాంట్లలోని బోర్లను సైదాబాద్ మండల రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. కొద్దిరోజులకే తిరిగి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. నిబంధనలు పాటించకుండా మంచినీటి వ్యాపారం సాగించే వారిపై చర్యలు తీసుకోవాలి - కోట్ల లడ్డు పటేల్, వాణినగర్



అధికారులు స్పందించాలి

సైదాబాద్, మాదన్నపేట పరిసరాల్లో అక్రమంగా వాటర్ ప్లాంట్లు వెలిశాయి. ఇంకా వెలుస్తునే ఉన్నాయి, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. బోరు నీటితో ప్లాంట్లను నిర్వహిస్తూ భూగర్భజలాలు తోడేస్తున్నారు. ఎన్నోసార్లు అధికారులకు దృష్టికి తీసుకువెళ్లా. పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి

-నాగరిగారి దాసు, సింగరేణి కాలనీ

మల్కాజిగిరి కాంగ్రెస్‌దే : మధుయాష్కీ



వనస్థలిపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం ఉదయం కర్మన్‌ఘాట్‌లోని కొత్తకాపు యాదవరెడ్డి గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మల్కాజిగిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలను సమాయత్తం చేస్తున్నట్లు తెలిపారు. బూత్, డివిజన్, నియోజకవర్గ కార్యకర్తలతో పాటు అనుబంధ సంఘాల కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో విసిగిపోయిన ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించారని, లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీని అందించే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశానికి మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మల్కాజిగిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి, లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిలు హాజరవుతున్నట్లు తెలిపారు.


మహేశ్‌ను సన్మానిస్తున్న కార్మికసంఘాల నేతలు

బీఎంఎస్ నేతకు సన్మానం

సైదాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : చంచల్‌గూడ ప్రభుత్వ ముద్రణాలయంలో విధులు నిర్వహిస్తున్న బీఎంఎస్ (భారతీయ మజ్దూర్ సంఘ్) రాష్ట్ర నేత చవ్వ మహేశ్ శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల జేఏసీ నేతలు ఘనంగా సన్మానించారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ముద్రణాలయం కార్మికుల సమస్య పరిష్కారానికి మహేశ్ చేసిన సేవలు మరువలేనివని అన్నారు. అంకితబావంతో పనిచేసి అందరి మన్ననలు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బి.చక్రధర్, యూనియన్ నేతలు ఎస్.శ్రీనివాస్ రావు, సూరజ్, కిరణ్, నవీన్, నందగోపాల్, ముంతాజ్‌బాయ్, రాంచందర్, శ్రీశైలం పాల్గొన్నారు.

స్టీల్ బ్రిడ్జి అలైన్‌మెంట్ మార్పుకు ఎస్ఈ హామీ!


ఎస్ఈతో సమావేశమైన ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ నేతలు

సైదాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్ ప్రధాన రహదారిపై పురాతన హనుమాన్ ఆలయం వద్ద నిర్మిస్తున్న వివాదాస్పద స్టీల్ బ్రిడ్జి నిర్మాణం అలైన్‌మెంట్ మార్పుకు ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) దత్తుపంత్ హామీ ఇచ్చారని ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ నేతలు తెలిపారు. ఆలయానికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలియజేశారని వివరించారు. దీంతో నిరసన కార్యక్రమాలు తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు మాజీ కార్పొరేటర్ సహదేవ్ యాదవ్, బీజేపీ నేతలు నిరంజన్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, వినోద్ గౌడ్, బండ వెంకట్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు చవ్వ సతీష్, బర్ల శ్రవణ్ కుమార్ పేర్కొన్నారు.

ఇద్దరి మృతికి కారణమైన ఫిట్‌నెస్ లేని లారీ.. లైసెన్స్‌లేని డ్రైవర్

- రోడ్డు ప్రమాదం కేసులో ముగ్గురి అరెస్టు
- పరారీలో డ్రైవర్, ఫ్లైఓవర్ నిర్మాణ సంస్థ ఎండీ

బోయినపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఫిట్‌నెస్ లేని లారీతో లైసెన్స్ లేని డ్రైవర్ చేసిన ప్రమాదం వల్ల రెండు నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడానికి లారీ యజమాని మరో నేరం చేశాడు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ స్థానంలో నకిలీ డ్రైవర్‌ను చూపించి పోలీసులను తప్పుదోవ పట్టించాడు. దర్యాప్తు చేసిన పోలీసులు లారీ యజమానితో పాటు.. ప్రమాదానికి కారణమైన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో లారీ డ్రైవర్, ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చేస్తున్న సంస్థ ఎండీ పరారీలో ఉన్నారు. శనివారం బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌లో నార్త్‌జోన్ శాంతిభద్రతల విభాగం డీసీపీ రోహిణి ప్రియదర్శిని, ట్రాఫిక్ డీసీపీ సుబ్బారాయుడుతో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మేడ్చల్ జాతీయ రహదారిలోని మిలటరీ డైరీఫాం సమీపంలో లక్ష్మీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టింది. అక్కడ ఎలాంటి ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. మార్చి 24 అర్ధరాత్రి 44వ పిల్లర్ వద్ద భారత్ ఫైబర్ కేబుల్‌కు సంబంధించిన వైర్లు కిందపడ్డాయి. అవి తగిలి ఓ వాహనదారుడు కిందపడ్డాడు. వైర్లను తొలగించే క్రమంలో వాహనాలు ఆగాయి. అదే సమయంలో సుచిత్ర నుంచి వేగంగా వస్తున్న లారీ ముందున్న రెండు ద్విచక్రవాహనాలను ఢీకొంది. ఈ ఘటనలో ఓ బైక్‌పై ఉన్న ఆకాశరాజ్, నందిని అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారయ్యాడు. సమాచారం అందుకున్న బోయినపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

డ్రైవర్‌ను మార్చేసి, పోలీసులను ఏ మార్చి..

ప్రమాదానికి కారణమైన లారీకి ఫిట్‌నెస్ లేదని, డ్రైవర్‌కు లైసెన్స్ లేదని తెలిసిన లారీ యజమాని ఎలాగైనా కేసు నుంచి బయటపడాలని ప్లాన్ వేశాడు. పారిపోయిన డ్రైవర్ స్థానంలో లైసెన్స్ ఉన్న నకిలీ డ్రైవర్‌ను పెట్టి పోలీసులకు అప్పగించాడు. ఈ కేసులో భద్రత చర్యలు తీసుకోని ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చేస్తున్న సంస్థ ప్రాజెక్టు మేనేజరైన విజయవాడకు చెందిన కె.రాఘవేంద్ర, ఖైరతాబాద్‌కు చెందిన భారత్ ఫైబర్ నెట్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గడ్డం పూర్ణచందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ జరుపుతున్న క్రమంలో లారీ నడిపిన డ్రైవర్ లొంగిపోయిన వ్యక్తి కాదని, వేరే వ్యక్తి అయి ఉంటాడని పోలీసులకు అనుమానం వచ్చింది. లొంగిపోయిన డ్రైవర్‌ను తమదైన శైలిలో విచారించగా యజమాని సూచనతోనే లొంగిపోయానని అతడు వెల్లడించాడు. అతడిచ్చిన సమాచారంతో మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన లారీ యజమాని అర్జున్‌సింగ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మరో నిర్మాణ సంస్థ లక్ష్మీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎండీ వేములపల్లి కిరణ్‌కుమార్, ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ ఉర్థి షేక్ పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ సమస్యలపై నేడు డయల్ యువర్ డీఎం

హయత్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : హయత్‌నగర్ ఆర్టీసీ 1, 2 డిపోల్లో ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం ఆదివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జలగం విజయ్, శ్రీనివాస్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలియజేయాలని, సూచనలు, సలహాలు ఇవ్వాలని వారు కోరారు. హయత్‌నగర్ -1 డిపోకు సంబంధించిన సమస్యలను ఫోన్ 9959226138 ద్వారా, హయత్‌నగర్-2 డిపోకు సంబంధించిన సమస్యలను, సూచనలను ఫోన్ నంబర్ 9959226419లో తెలపాలని సూచించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎల్‌సీల మంజూరుపై హర్షం

వనస్థలిపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ సర్కిల్ 27/11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కోసం ఎల్‌సీలు మంజూరు చేసినందుకు తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్ అసోసియేషన్ ప్రతినిధులు ఎస్ఇ కరుణాకర్ బాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఎల్‌సీలు ఇవ్వడంలో జాప్యం జరుగుతుండటంపై ఇటీవల కాంట్రాక్టర్లు ఆటోనగర్‌లోని విద్యుత్ కార్యాలయంలో ఎస్ఇ కరుణాకర్ బాబును కలిసి వినియోగదారుల ఇబ్బందులను వివరించినట్టు అసోసియేషన్ ప్రతినిధి శశిధర్ రెడ్డి పేర్కొన్నారు. అందుకు స్పందించిన కరుణాకర్ బాబు ఎల్‌సీలు మంజూరు చేయడంతో పాటు 26 చోట్ల నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, విద్యుత్ మరమ్మతులకు అనుమతి ఇవ్వడం హర్షణీయమన్నారు. ఎస్ఇని కలిసిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు ప్రదీప్ రెడ్డి, కర్ణాకర్ రెడ్డి, నవీన్ రెడ్డి, సురేష్, శ్రీనివాస్ ఉన్నారు.


కాలువ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి

వరదనీటి కాలువ పనులను పూర్తి చేయాలి

వనస్థలిపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వరదనీటి కాలువ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. వనస్థలిపురం ఈస్ట్రన్ కాలనీ నుంచి హైకోర్టు కాలనీ, జగదాంబ కాలనీ మీదుగా వచ్చే వరదనీటి కాలువ పనులను శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వరదనీటి కాలువ నిర్మాణం కోసం నిధులు మంజూరై చాలాకాలమైందని, కాలువ మార్గంలో ప్రైవేట్ స్థలం ఉందని, నిర్మాణానికి వారు నిరాకరించడంతో పనులు ఆలస్యమవుతున్నాయన్నారు. అందుకు ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించామని, త్వరలో పనులను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ ఏసీపీ పావని, డీఇ దామోదర్ రావు, ఏఇ చంద్రశేఖర్, కాలనీవాసులు పాల్గొన్నారు.


వెంకట నర్సింహారెడ్డి దంపతులను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్ యాదవ్, తదితరులు

శేష జీవితాన్ని విద్యాభివృద్ధి కోసం అందించాలి

చంపాపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కర్మన్‌ఘాట్ ప్రభుత్వ కేంద్ర ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం బి.వెంకట నర్సింహారెడ్డి శనివారం పదవీ విరమణ పొందారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన వీడ్కోలు సమావేశానికి ముఖ్యఅతిథులుగా సరూర్‌నగర్ మండల విద్యాధికారి కృష్ణ, పీఆర్‌టీయూ టీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్‌యాదవ్, పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎం ఉమాదేవి, మండల నోడల్ అధికారి అరుణ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈవో కృష్ణ మాట్లాడుతూ వెంకట నర్సింహారెడ్డి 40 సంవత్సరాల పాటు వివిధ పాఠశాలల్లో పనిచేసి మన్ననలు పొందారని కొనియాడారు. ఆయన శేష జీవితం విద్యాభివృద్ధికి కోసం అందించాలని కోరారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, స్నేహితులు, బంధువులు వెంకటనర్సింహారెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ సరూర్‌నగర్ మండల అధ్యక్ష, కార్యదర్శి, సంఘం నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర సోషలిస్ట్ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్‌కుమార్

విద్యార్థుల మెస్‌చార్జీలను పెంచాలి

చాదర్‌ఘాట్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలను పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డికి రాష్ట్ర సోషలిస్ట్ స్టూడెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరల మహేష్‌కుమార్ విజ్ఞప్తిచేశారు. శనివారం సాయంత్రం ఆయన మలక్‌పేటలో విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం మెస్‌చార్జీలను పెంచకుండా కాలయాపన చేసిందని, విద్యార్థుల ఆగ్రహం కారణంగానే గత ప్రభుత్వం ఓటమి పాలైందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీల కోసం అవసరమైన బడ్జెట్ కేటాయించాలని విజ్ఞప్తిచేశారు. మెస్ చార్జీల పెంపుపై నిర్లక్ష్యం వహిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యార్థుల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు.